ఇంత పెద్ద మహానగరంలో బావ ఎలా కనిపిస్తాడు? ఎలా వెతికేదీ? ..

స్టేషన్‌కు రమ్మని వుత్తరం రాశా నన్నారు నాన్నగారు ఆ వుత్తరం బావకి అందిందో లేదోమరి!

పాపం, బావ స్టేషన్‌కి వచ్చి, మమ్మల్ని పోల్చుకోలేకపోయాడో ఏమో'. ఎందుకు పోల్చుకోలేడూ? . నాన్నగారు వుత్తరంలో రాశారుకూడా — నాకు ఇరవైయ్యేళ్ళనీ, అమ్మమ్మకి యాభైరెండు అని—అందుకనే స్టేషన్‌లో అమ్మమ్మ చెయ్యి వదలకుండా కూడా నించున్నాను—

కాస్త సూటూ బూటూ వేసుకున్న కుర్రాళ్లందరివైపూ ధైర్యంచేసి చూశాను కూడా — ఏం లాభం? బావ ఎలా వుంటాడో నాకు తెలీదు నేను ఎలా వుంటానో బావకి తెలీదు —

ఇలా జరుగుతుందని నేను ముందే అనుకున్నాను — అందుకనే స్టేషన్‌నుండి బావవుండే రూమ్‌కి వెళ్ళవలసిన గుర్తు లన్నీ అడిగి తెలుసుకొని రాసుకున్నాను— కానీ, ఇంత జనంలో, ఇన్ని కార్ల మధ్య ఇంతమంది మగాళ్ళ మధ్య బిక్కు-బిక్కున నడుస్తూ — ఏ మగాడిని పిలిచి ఆ గుర్తులు చెప్పి అడిగేదీ? పైగా, దారినిపోయే పద్నాలుగేళ్ళ పిల్లాడు మొదలుకొని అరవయ్యేళ్ళ తాతయ్యవరకూ అందరూ గుచ్చిగుచ్చి చూసేవాళ్ళే'

పోనీ, రిక్షా పిలిచి మాట్లాడుద్దా మంటే — ఏమో వాడు ఎక్కడకు తీసుకు పోతాడోమరి ?...

అమ్మమ్మని వెంటబెట్టుకొని, లేని ధైర్యం తెచ్చుకుంటూ .నడుస్తున్నాను

నేనే అంటే — నా కంటే కొత్త మా అమ్మమ్మకి — ఎక్కడో కారు హారన్ కొడితే ఇక్కడ కంగారయిపోయి; నా చెయ్యి పుచ్చుకు వెనక్కు లాగే స్తుంది నడుస్తున్నకొద్దీ రోడ్డు పెరుగు తోంది నాన్న చెప్పిన కొండగుర్తు — ఓ సినిమాహాలు పేరు ఆ సినిమాహాలు కనిపించలేదు

ఇక లాభంలేదు — మనం దారి తప్పేము—కాబట్టి రిక్షా పిలవ్వల్సిందేనని నిశ్చయించుకున్నాను — పిలిచేను సినిమాహాలు పేరు, బావ అద్దెకుంటున్న మేడ పేరూ చెప్పేను రిక్షావాలా ముసలాడు మాటల్నిబట్టి మంచివాడి లాగనే కనిపించేడు

'ఇంతదూరం నడిచాకా రిక్షాఎందుకే?' అంటూ మూలిగింది అమ్మమ్మ —

'నా మొహం .ఇద్దరం దారి తప్పేం'' అని చెవిలో చెప్పేను —

'ఇద్దరం అంటావేం? చదువుకొన్న దానివికదా, ఆ మాత్రం ఇల్లు కనుక్కో లేకపోతే, ఎందుకే నీ చదువు? నేనె

ప్పుడో పది హేనేళ్ళప్పుడు చూశా నీ వూరు అప్పుడు ఇన్ని మేడ లెక్కడివి.. ఇంతమంది జనం ఎక్కడ . ' అంది —

ఈ మాట అక్కడ నాన్నతో చెప్పకపోయిందామరి ? ... అప్పుడేమో నాకు అన్నీ తెలుసు ? ఒక్కసారిచూస్తే మర్చిపోను అన్నది

సరే, రిక్షావాడు తిన్నగా తీసుకువచ్చి నాన్న చెప్పిన మేడ దగ్గర నించో బెట్టేడు వాడికి డబ్బులు యిచ్చి మేడ మీదికి బయలుదేరాము —

మేడమీద అన్నీ వరస రూమ్‌లు బావవుండే రూమ్ నంబర్ తొమ్మిది ఆ మేడమీదవున్న వాళ్ళంతా కుర్రాళ్ళే అనుకుంటాను —

హిందీ సినిమా పాటలు, ఆటలు, కబుర్లు గోల ' నాకు నిప్పులమీద నడిచినట్టనిపించింది — అయినా తప్ప దుగా , తలెత్తి రూమ్ నంబర్లు చూస్తూనే వున్నాను—

తొమ్మిదో నంబర్ రూమ్ తలుపు మూసేసివుంది

'అమ్మమ్మా ' బావగది యిదే '' అని అమ్మమ్మకి మాత్రమే వినిపించేలాగ చెప్పాను —

'ఇంకేం — నేను వాణ్ని పోల్చుకో గలను పదేళ్ళప్పుడు చూసినా ఐదేళ్ళ ప్పుడుచూసినా నాకుగుర్తే ' ' అంటూ అమ్మమ్మ తలుపు దబదబా బాదింది —

కొంచెం సేపట్లోనే ఓ అబ్బాయి తలుపుతీసి, నిర్ఘాంతబోయి — 'ఎవరూ ?' అన్నాడు —

'నేను రా .. మీ అమ్మమ్మని ' ... హోరి భడవా నిన్ను చిన్నప్పుడు ఎత్తుకొని ఆడించేనురా . ' అంటూ అమ్మమ్మ అతగాణ్ని తోసుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది —

ఆ అబ్బాయి నన్ను చూసి తన పై మీది తువాలు సరిచేసుకుంటూ 'రండి' అంటూ పక్కకుజరిగేడు — చేతిలో సంచీ అందుకున్నాడు —

'ఎంతమారిపోయావ్‌రా ! .. చిన్న ప్పుడు నల్లగా వుండేవాడివి ! ఇప్పుడు తెల్లగా ఐపోయావు అప్పుడు దుండు ముక్కలాగా వుండేవాడివి ' . ఎంత సన్నంగా అయిపోయావు ? . ఔన్లే, ఈ రోజుల్లో సన్నంగా వుండడం పేషనుగా ' . ' అంటూ అమ్మమ్మ బావకి 'ఉఁ' అనడానికి కూడా అవకాశం యివ్వలేదు—

మంచంమీదవున్న చిత్తుకాయితాలూ, పుస్తకాలూ అన్నీ గుచ్చెత్తి పక్కన పడేసి 'రండి కూర్చోండి '' అన్నాడు బావ, నించున్న నన్ను చూసి

'అండీ ఏమిట్రా మరీ బడాయి ! అది నీ మేనత్త కూతురు సరళ అయి తేనూ ' అంటూ కూర్చున్నదల్లా లేచి నించుంది అమ్మమ్మ

'అలాగా ... క్షమించండి!' అన్నట్టు మొహం పెట్టేడు బావ —

అంతలో 'ఔనూ ... నువ్వు స్టేషనుకు రాకుండా ... యిక్కడ సింగారం చేసుకుంటూ వుండిపోయావుకదా మేం ఎలా వస్తాం అనుకున్నావురా అబ్బీ ?. నేను ముసిలిముండనీ ... అది ఆడకూతురు...యింత పెద్ద పట్నంలో...ఎవడి బుద్ధులెలా వుంటాయో ... రోజులిలా వున్నాయికదా... ఇదేమన్నా ఆలోచించావానువ్వు ?...' అంటూ నిలదీసిమరీ అడిగింది అమ్మమ్మ—

పాపం ... బావ బిత్తర చూపులు చూశాడు—

'అదిగాదు... మామయ్యవుత్తరంలో అన్నివిధాల రాశాడు కదా ! పోనీ, మామయ్యమీద నీకు గౌరవం లేదనుకో_ మీ నాన్నమీద గౌరవం వుందికదా!...'_

బావధైర్యం చేసుకొని 'ఉత్తరాలా?' అని ఆశ్చర్యబోయాడు, అమ్మమ్మ మాటలకి అడ్డుపడి—

'వుత్తరాలా అని బిత్తరపోతావేంరా? నీకు ఉత్తరాలు యేం రాలేదా ? ..'

'ఉ((హు(...'

'నే నప్పుడే అన్నానురా ... అన్ని వేల వుత్తరాలలో పోస్టుచేస్తే... మన వుత్తరం పోతుందని. మీ మామయ్య వింటేనా ?...' అని ఇటు తిరిగింది అమ్మమ్మ—

"అమ్మా, నువ్వుచెప్పినట్టు నేనెందుకు వినాలి?"
"ఎందు కేమిటి ? నీ అంతప్పుడు మా అమ్మ చెప్పినట్టు నేను విన్నాను, మా అమ్మకూడా అదేవిధంగా వాళ్ళమ్మ చెప్పినట్టు విన్నది."
"అవును గాని అమ్మా, ఈ చాదస్తం అసలు మొదలు పెట్టింది ఎవరూ ?"

'సరే, మీరు ముందు స్నానం అదీ చెయ్యండి. నేను భోజనాల ఏర్పాటు చూసి వస్తాను—' అంటూ బావ, బట్టలు వేసుకొని తలుపుదగ్గరగా వేసుకొని వెళ్లిపోయాడు—

* * *

నాకు బావ ప్రవర్తన యేం నచ్చలేదు అయినా, నాన్నగారి అమాయకత్వం కానీ—చక్కగా బియ్యేస్సీ చదువుకొని, నిక్షేపంలాంటి ఉద్యోగం చేసుకుంటూ, నెలకి నూటయాభై రూపాయలు ఆర్జించుకుంటున్నబావ యింతవరకు ఎవర్నీ ప్రేమించకుండా ఉంటాడా ?...

అమ్మమాట కాదనలేక మామయ్య వేసిన ప్లానేయిది!...నిజంగా నన్ను తన యింటి కోడల్ని చేసుకోవాలని అను

కొన్నట్టయితే—బావకి వుత్తరం ఎందుకు రాయలేదు ?.

వాడు యిష్టపడాలిగానీ...నాదేముందీ అని అమ్మని మభ్యపెడతాడా ? ....

ఛీఛీ '...ఈ ఇరవయ్యో శతాబ్దంలో ఆడపిల్లగా పుట్టడమే మహాపాపం !...

ఈ బావ ప్రవర్తన చూస్తూవుంటే మమ్మల్ని వదిలించుకోవాలని చూస్తున్నా డల్లేవుంది !...నిజమే ' నాన్న రాసిన వుత్తరం అందకుండా వుంటుందా ?—

కానీ—

బావ రానేవచ్చాడు

ఒక కారియర్, ఓ డజను అరటి పళ్ళు, రెండు యాపిలుపళ్ళు, కాసిన్ని ద్రాక్షపళ్ళు తీసుకొని వచ్చాడు—

'ఇవన్నీ ఎవరికి ?' అని అడిగేను—

'మీకే' ... నిన్ననగా బయలు దేరారుకదా...' అంటూ తలుపు మూసి వచ్చాడు

'నేను హోటల్లో భోజనంచేసేశాను. ఆ కారియర్ మీ యిద్దరికే '...' అని చెప్పి, వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

* * *

అమ్మమ్మ చెప్పినట్టు వెళ్ళి ఆరోజు ఆఫీసుకి సెలవుపెట్టి వచ్చాడు—

ఆ మధ్యాహ్నం అమ్మమ్మ అడి గింది — 'ఇంతకీ నీ ఉద్దేశం ఏమిట్రా ?' అని

'ఉద్దేశమా ? దేన్ని గురించీ '' అని అడిగాడు బావ—

'సరి...బాగుందివరస '...ఇప్పుడు యెందుకు వచ్చామో తెలుసా ?...'

'..... .... '

'మీ నాన్నకి నీ పెళ్ళి గురించేమీ తెలియదుట '...నువ్వు ఏ పిల్లని చేసు కుంటానంటే ఆ పిల్లని — నువ్వు కోరిన ముహూర్తానికి పెళ్ళి చెయ్యడానికి సిద్ధంగా వున్నాడుట ' ... ఇది నీ మేనత్త కూతురు స్కూలు ఫైనలు తప్పింది ! వీణ నేర్చుకుంది పాడు తుంది పేరు సరళ ' దీనిని నువ్వు చేసు కుంటావో చేసుకోవో ఖచ్చితంగా, నిర్మొహమాటంగాచెప్పేయ్!తెలిసిందా?' అంటూ కుండ బద్దలుకొట్టినట్లు చెప్పిన అమ్మమ్మ మాటలకి — నాకు ఓ పక్కన సిగ్గూ — మరో పక్కన ఆడపిల్లనై ఎందుకు పుట్టానా అన్నబాధా — మరో పక్కన బావ ఏమంటాడోనని ఆత్రుతల మధ్య ఉక్కిరి బిక్కిరి అయిపోయాను

ఇంతలో ఎవరో బయటినుంచి,

'గోపాలం '' అని కేకేశారు—

బావ 'ఇప్పుడే వస్తా' నంటూ తలుపు తీసుకుని దగ్గరవేసుకొని బయటకు వెళ్లాడు

'ఔనూ...బావపేరు క్రిష్ణ కదే ...' అని అమ్మమ్మని అడిగాను

'బావుంది మరీను ! చిన్ని కృష్ణ మూర్తి' అని చెప్పింది అమ్మమ్మ —

'మరి వాళ్ళ ఫ్రెండ్సు గోపాలం అని కేకేశారే'... పేరు మార్చుకున్నాడేమో'' అన్నాను—

అంతలో బావ రానేవచ్చాడు

'ఏరా నాయనా ' నువ్వు పేరుకూడా మార్చుకున్నావా ? చక్కగా మీ తాతయ్యా పేరు పెడితే.. గోపాలం ఏమిట్రా గోపాలం ?' అని వెంటనే అడిగేసింది అమ్మమ్మ

'నా పేరు గోపాలమేగా !...'

'ఎవరన్నారు ?...'

'ఒకరనేదేమిటీ ... ఎస్సెల్సీ రిజిస్టర్‌లో వుంటేనూ...నా పేరు వేణు గోపాలరావు ' ఇంటో అంతా గోపాలం అనే పిలుస్తారుగా '' — బావకి పేరు మాట ఎత్తేసరికి లేని గొంతు వచ్చింది లాగా వుంది.

'అదికాదు...నీ పేరు చిన్ని కృష్ణ మూర్తి కదూ ?...'

'నయమే ' ఎవరన్నారూ ?—'

అయ్యబాబోయ్ ? ఈ అమ్మమ్మ కొంప ముంచేసింది '...

అతగాడి ఇంటిపేరుకూడా మారి పోయింది '!.... .

'ఈ రూమ్‌నంబర్ తొమ్మిదేనా' అని అడిగాను.

'కాదు...ఆరు' అన్నాడు అతగాడు—

'అయ్యో ! బయట తొమ్మిదనేవుంది కదండీ '...' అన్నాను—

"ఏమండీ పిలిచారా ? బెల్ మ్రోగింది

'అబ్బే...చెక్కకివున్న మేకు లూజ్ అయి అది అలా తిరిగి పోతుందండీ—' అంటూ తలుపు తీసి — తలుపుకివున్న గుండ్రని చెక్కని కిందికి తిప్పేడు—

'ఏమే ... .ఇలా తీశావు నా ప్రాణాలు ?' అంటూ పిచ్చెత్తి పోయింది అమ్మమ్మ—

'మామ్మగారూ ! మీరేం కంగారు పడకండి ! మీకు రూమ్ నంబర్ తొమ్మిది కావాలికదా ! పదండి...తీసుకు వెళ్తాను ......' అంటూ మా యిద్దర్నీ తొమ్మిదో నంబర్‌గదికి తీసుకువెళ్లాడు.

తలుపుకొట్టి 'ఒరే క్రిష్ణా! క్రిష్ణా!!' అని కేకేశాడు—

అతనూ బావ !...

చిన్నప్పుడేం......బావ పెద్దప్పుడు కూడా నల్లగానే వున్నాడు మరి!...

అతను మమ్మల్ని చూసి — 'రండి రండి '......నేను పొద్దుటే వచ్చాను

ఈ మధ్య వారంరోజులుగా వూళ్ళోలేను ఆఫీసుపనిమీద వూరువెళ్ళాను ఉత్తరాలు చూసుకొని మీరువచ్చి వెళ్ళిపోయారనుకున్నా' ఇవాళే వచ్చారన్నమాట'! మంచిదే!... దేవుడు మంచిపని చేశాడు!!

హమ్మయ్య!... ఇతగాడికి నిజంగా అమ్మమ్మ పోలికలు వున్నాయి ఈ ధోరణి చూస్తూవుంటే .....అసలు మమ్మల్ని మాట్లాడనిస్తాడా అనిపించింది—

పూర్తిగా చెమటతో తడిసిపోయిన నన్ను చూసి—గోపాలం ఫానువేశాడు—

'వీళ్ళని నీకెలా తెలుసురా?' అన్నాడు బావ—

'తెలియడం ఏమిట్రా?' అంటూ వెనక పేజీలన్నీ చదివి వినిపించాడు—

'అదాసంగతి' సరిలే'' బామ్మా... నువ్వేం బాధపడకు' వీడుకూడా నాలాంటివాడే! పైగా, మనకులం వీడికులం అన్నీ ఒక్కటే'', ' అని, అమ్మమ్మని ఓదార్చేడు బావ—

మేము ఆరాత్రే బయలుదేరి మావూరు వచ్చేశాం!—

బావ తన అభిప్రాయం వుత్తరంలో రాస్తానని చెప్పాడు—

* * *

తర్వాత, బావదగ్గర్నుంచి వుత్తరం కూడా వచ్చింది—తనకి యిప్పట్లో పెళ్ళి చేసుకోవాలని లేదనీ, పైగా మేనరికం తనకి యిష్టంలేదనీను—

అంతకుముందు రోజే నాకో వుత్తరం వచ్చింది—అదిచాలా కొత్త దస్తూరీ. విప్పి చూశాను—

'మీకు—నిజం చెపుతున్నాను నన్నింతవరకూ ఏ అమ్మాయీ ప్రేమించలేదు నేనుకూడా ఎవర్నీ పెళ్ళాడదామని అనుకోలేదు కానీ, మిమ్మల్ని చూశాకా ఆకోరిక కలిగింది—నేను స్కూలుఫైనలు ప్యాసయ్యాను కానీ, ఉద్యోగంమాత్రం నెలకి నూటడెబ్భై రూపాయలు వచ్చేది చేస్తున్నాను—మీరు సరేనంటే—మా నాన్నగారిని మీ అమ్మా, నాన్నగారిదగ్గిరికి పంపుతాను — సాహసించాను — మీ స్వదస్తూరీతో జవాబు రాయండి!... ఇట్లు నేను, గోపాలం'

తర్వాత—

తర్వాత...ఏం చెప్పేది' .

నాకు చెప్పడం రాదుమరి'......